
# జలంధర్ మాయ



**చిన్నప్పణ్నుంచి** పత్రికలలో అలాటి ప్రకటనలు రామం చూస్తూనేవున్నాడు. 'గొప్పశక్తి గల వశీకరణ ఉంగరం. ధరిస్తే మీ ప్రేయసి మీ స్వంతం' వంటివి. అవి నమ్మాలో, లేదో అతనికి తెలియదు, ఎందుకంటే అది ఉపయోగించి, సత్ఫలితాలు సాధించిన వాళ్ళెవరూ అతనికి తారసిల్లలేదు. 'తనకీ దాని అవసరం పడివుండేది కాదు, ఈ ఇంట్లో అద్దెకు దిగివుండకపోతే, రేదర్, ఇంటివాళ్ళమ్మాయి ప్రవీణ, మరీ అంత అందంగా ఉండకపోయివుంటే. ప్రవీణ కూడా తనంటే ఇష్టంగానే ఉండేది. తనావేళ తొందరపడివుండకపోతే, ఆ ఇష్టం ప్రేమలోకి తర్జుమా అయ్యేది కూడా.

ఎమ్బీయస్ ప్రసాద్

కానీ ఆవేళ తనను తాను నిగ్రహించుకోలేక పోయాడు. అప్పుడే తలంటు పోసుకొని ఆమె బాత్‌రూమ్‌లో నుండి తువ్వాలు కట్టుకుని వస్తూంటే, దాగీ దాగని అందాలు మతి పోగొట్టేసాయి. చటుక్కున తన ప్రమేయం లేకుండానే చేయి వెళ్ళి ఆమె పిరుదులను నిమిరింది. అంతే! ఒక్క క్షణం మాత్రం ఆలస్యమయింది. చాచి లెంపకాయ కొట్టింది ప్రవీణ. తనకు బుర్ర తిరిగిపోయింది. తలెత్తి చూస్తే ఒట్టు. అవాళ్ళించి మళ్ళీ ఆమెను పలకరిస్తే ఒట్టు. ఎప్పుడు ఇల్లు ఖాళీ చేయమంటారో తెలీదు, శాశ్వతంగా మర్చిపోతే మంచిదనుకున్నాడు. కానీ తన తరం కాలేదు.

ఈ లూధియానా ప్రకటన చూసిన తర్వాతే ఐడియా వచ్చింది. ప్రవీణ అమ్మానాన్నకు యింత ఇల్లుంది. కొడుకు ఫారిన్‌లో ఉన్నాడు. తనలాటి మధ్యతరగతి వాడికి పిల్లనిస్తాననరు కదా. కూతురు ఇష్టపడిందంటే రాజీపడవచ్చు. అందువల్ల ప్రవీణను వశపరుచుకోవాలి. ఇవాళే రాస్తే సరి.

రామం అనుకోకుండా ఊరు వెళ్ళి తిరిగివచ్చేసరికి ఇంటాయన పలకరించాడు. "నువ్వు ఊళ్ళో లేనప్పుడు లూధియానా నుండి పార్సిల్ వచ్చిందోయ్. డబ్బు కట్టి తీసుకోవాలన్నాడు పోస్ట్‌మేన్. సందేహం వచ్చింది. మా ఇంట్లోవాళ్ళు కూడా చెప్పలేకపోయారు, అదేమిటో తెలీదు. నీకు కావాలని అడిగేవో, లేదో తెలియదు. ఒక్కోప్పుడు అడక్కుండానే ట్రాన్సిస్టర్లు పంపించేస్తారు చూడు. రిస్కెందుకుని తిప్పి పంపేసాను.... " అని ఆయన సంజాయిషీగా చెబుతుండగానే "ఫర్వాలేదు, బాంక్ పరీక్షలకని పుస్తకాలు తెప్పించాను. పోస్టాఫీసులో కనుక్కొంటాను లెండి" అని మాట తుంచేసాడు రామం.

పోస్టాఫీసులో కనుక్కొంటే పార్సిల్ తిప్పి పంపేసామన్నారు. ఇదేమిట్రా ఇలా అపశకునం జరిగిందనుకుని బాధ పడుతూండగానే ఒకరోజు పోస్టులో ఒక తాయెత్తు వచ్చింది. 'నీవు రాయకపోయినా నీ కోరిక గ్రహించాము. ఇది ధరిస్తే మీకు కావలసిన వ్యక్తి మీకు వశమవుతారు. దీనితో జతపరిచిన ఉత్తరాన్ని పదిమందికి పంపి, శ్రీశైలం దేవస్థానానికి నూరు రూపాయలు పంపండి' అని ఉంది. ఎక్కణ్నుంచి వచ్చిందో ఆ వివరం లేదు. నమ్మాలో, నమ్మకూడదో తెలియదు. 'దేవస్థానానికేగా డబ్బు పంపమన్నది, పని కాకపోయినా పుణ్యమైనా వస్తుంది' అని సరిపెట్టుకుని డబ్బు పంపించి, పదిమందికి ఉత్తరాలు పంపించి, దాంట్లో రాసిన ప్రకారం అమావాస్య నాడు తాయెత్తు కట్టుకున్నాడు.

ఇరవై ఒకటో శతాబ్దంలో అడుగుపెడుతూ కూడా ఈ మూఢనమ్మకాలేనా అనుకుంటూ కట్టుకున్నాడు కానీ దాని మహిమ చూసేసరికి, మంత్ర తంత్రాలలో నమ్మకం కుదిరిందతనికి, కట్టుకున్న రోజునే వెళ్ళి ప్రవీణను పలకరించాడు. నవ్వుతూ మాట్లాడింది. 'సినిమా కొస్తావా?' అనేసాడు. అంత తెగువ ఎలా వచ్చిందో అతనికే తెలియలేదు. 'మా తమ్ముడితో సహా వస్తాను' అంది కొంటెగా చూస్తూ. అదే భాగ్యం అనుకొన్నాడు రామం.

సినిమాహాల్లో ఆమె పక్కకుర్చీలోనే కూర్చున్నా అతనికి దూరంగానే జరిగి కూచింది. అది మాత్రం ఎంతసేపు కనక! రామం తాయెత్తు కట్టిన చేత్తో ఆమెను తాకేవరకే. ఆ తర్వాత ఆమె పరవశించింది. అతని చేతిని స్పృశించింది. వేళల్లో వేళ్ళు కలిపి ముడివేసింది. రామానికి తాయెత్తిచ్చిన ధైర్యం బాగా పనిచేసింది. ఇంటర్వెల్‌లో అడిగేసాడు. "నన్ను పెళ్ళి చేసుకుంటావా?" అని.

"మీరొప్పకోవాలిగా" అందామె ఆరాధనగా చూస్తూ. "నేనొప్పుకోవడం ఏమిటి, మీ అమ్మా, నాన్నా ఒప్పుకోవాలి నా లాటి మిడిల్‌క్లాస్ గాడికి.." అనబోయాడు రామం అశ్చర్యంగా. "పైన హడావుడి చూడకండి. ఈ ఇంటి మీద చచ్చేటంత అప్పుంది. మా అన్నయ్య ఫారిన్లో ఉన్నాడన్నమాట గానీ పైసా పంపడు. వాళ్ళే అడుగుదురు గానీ కట్నం ఎక్కువడుగుతారని భయం." అని ఉన్న విషయం చెప్పేసింది ప్రవీణ.

రామం టైము వేస్టు చేయలేదు.తన తలిదండ్రులను ఒప్పించాడు. నెల తిరిగేసరికి వాళ్ళకు పెళ్ళయిపోయింది. నెలన్నరయ్యేటప్పటికి రామానికి సంసారంలో 'భార్య అలక' అనే అధ్యాయం అనుభవంలోకి వచ్చింది. ఆ రాత్రి ఎందుకో గానీ తాయెత్తు పనిచేయలేదు. రామం చీకటిలో తాయెత్తును ప్రవీణ నుదుటికి తగిలించేదు కూడా, అయినా ఆమె వశంలోకి రాలేదు. బాటరీలాగే వీటిని రీఛార్జ్

చేయాలి కాబోసనుకున్నాడు రామం.

మర్నాడు దాన్ని పూజామందిరంలో పెట్టి కళ్ళు మూసుకుని ప్రార్థిస్తుంటే ప్రవీణ ఎందుకో గానీ నవ్వింది. నిన్నటినుంచీ మాటలు లేవు కాబట్టి జనాంతికంగా అన్నట్టు "పేక ముక్కను ప్రార్థిస్తే భార్య లొంగుతుందా? ముచ్చట తీర్చాలి గానీ" అంది.

రామం కళ్ళు తెరిచి "నీ మొహం నీకేం తెలుసు. తాయెత్తులో బీజాక్షరాలుంటాయి తెలుసా. అది ధరిస్తే శుభం కలుగుతుంది." అన్నాడు.

"చాల్లెండి" అంటూ అతను వారిస్తున్నా ఆమె తాయెత్తు పీకేసింది. లోపల పేకముక్క మడిచి పెట్టి వుంది.

రామానికి ఏం జరిగిందో తెలీక వెర్రిమొహం వేసాడు. తనను వెర్రివాణ్ని చేసినట్టు తోచి కోపం తెచ్చుకున్నాడు.

ప్రవీణ బుంగమూతి పెట్టింది. "బాగుంది, ఏం చెయ్యమంటారు, అవేళ పనిమనిషి బాత్‌రూమ్‌లో ఉంది. మనని చూసింది. నేను ఏదో ఒకటి చేయకపోతే నా ప్రవర్తన మంచిది కాదని ఊరూ, వాడా యాగీ చేస్తుంది. అప్పటికీ లెంపకాయ కొట్టాక కన్నుగొట్టాను. కానీ మీరు నా వంక చూస్తేగా, అదే పోత పోయారు. తర్వాత పలకరించను కూడా పలకరించలేదు. లూథియానా పార్సిల్ వచ్చినప్పుడు ఫ్రమ్ అడ్రస్ చూసాను. పత్రికలో ప్రకటన నేనూ చూసానుగా. అదెందుకు తెప్పించారో, మీ లక్ష్యం ఏమిటో తెలిసింది. తాయెత్తు నేనే పంపాను... చావనా? మీలో ధైర్యం రగిలించకపోతే నా కోరిక తీరేదెలా?.. అసలే పిరికి...." అని ఆమె అంటూండగానే రామం ఆమెను వాటేసుకుని కసిదీరా ఆమె శరీరాన్ని నలిపేస్తున్నాడు. "ఇవాళ ఆఫీసుకి సెలవు పెట్టి నీ పని పడతాను చూడు" అంటూ.

●

(ఆంధ్రప్రభ వీక్లీ మార్చి 1998)

# ఆలూమగలీయం

## కేటూ - 'క్రి' కేటూ

> దక్షిణాఫ్రికాపై ఇండియా గెలిచిన క్రికెట్
> మ్యాచ్‌లో మాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు - వార్త

"ఏమండోయ్ విన్నారా! మనవాళ్లు క్రికెట్లో గెలిచారని మీరు చంకలు గుద్దుకున్నంత సేపు పట్టలేదు..."

"...పేపర్లో చదివాను లేవోయ్! అది మాచ్ ఫిక్సింగ్ దెబ్బ అంటున్నారు, నాకు నమ్మబుద్ధి కావటం లేదనుకో!"

"ఎలా అవుతుంది లెండి! దాని కోసం నిద్రాహారాలు మాని, ఆఫీసు పని ఎగ్గొట్టి, ఇంట్లో పనికి విగనామం పెట్టి..."

"...పిల్లల చదువు పట్టించుకోకుండా, ఫ్రెండ్స్‌తో పందాలు కట్టి, గొంతు చించుకొనేట్లా వాదించి, టీవీకి అతుక్కుపోయి... అను, అను... నా ఖర్మ కాలింది."

"పందెం అంటే గుర్తొచ్చింది. మీ నారాయణ గారు మీతో పందెం గెలిచి మనింట్లో డిన్నర్‌కొచ్చాడు కదా, ఇప్పుడు ఇండియా మోసంతో గెలిచింది కాబట్టి ఆవేళ మనం పెట్టింది..."

"...కక్కమంటావా? చాల్లే. డబ్బు తిన్నవాళ్లే కక్కటం లేదు. నా బాధ అది కాదు. దక్షిణాఫ్రికా ఎందుకు ఓడిపోయిందో, వాళ్ల టెక్నికల్ మిస్టేక్స్ ఏమిటో సహేతుకంగా విశ్లేషించి పత్రిక్కి వ్యాసం పంపాను..."


"...అది అచ్చువుతే అందరూ నవ్వుకుంటారని మీ బాధ. అంతేనా?"

"అంతేగా! డబ్బుతో తేలే వ్యవహారాల్లో ఈ పిచ్ బాగుండకపోవడాలు, స్పిన్ తిరగడాలు, బ్యాటింగ్ ఆర్డర్లు - వీటన్నిటి గోలా ఎందుకు రాస్తున్నాడ్రా ఈ పిచ్చివాడు అనుకుంటారని..."

"...పోనీ లెండి. హ్యూమర్ కాలంలో వేసుకుంటారేమో లెండి. అవునుగానీ ఒక్కోసారి వర్షం వచ్చి మ్యాచ్ కాన్సిల్ అయిపోతూంటుంది కదా, అప్పుడు వీళ్లు వరుణదేవుడితో కూడా ఏదైనా ఫిక్సింగ్.."

"చూస్తే అలానే ఉంది. ఆటను ఇలా భ్రష్టు పట్టిస్తే మాబోటి క్రికెట్ అభిమానులం ఎంత ఫీలవ్వాలో చూడు..."

"...మీరే అలా అంటే క్రికెటర్ల అభిమానుల సంగతేమిటి? ఆటగాళ్లు సరిగ్గా ఆడలేదని ఆత్మహత్య



చేసుకున్న వాళ్ల తల్లిదండ్రుల మాటేమిటి?"

"నిజమే! ఇక ఆట చూడాలంటేనే విసుగేస్తోంది. ఓవర్ ఓవర్‌కీ బాల్, బాల్‌కీ బెట్టింగ్‌ట, ఫిక్సింగ్‌ట. ఒక బౌండరీ కొట్టినప్పుడల్లా ఆటగాడి దగ్గరకెళ్లి 'ఎంతముట్టింది బాబూ?' అని అడగబుద్ధేస్తోంది."

"వ్యాపారీకరణ మహిమండీ! ఆటకు కాకుండా, ఆటగాళ్లకు గ్లామర్ పెంచారు. దాన్ని కేష్ చేసుకోవడానికి వాళ్లు ఎంతకైనా దిగజారుతున్నారు. మన పిల్లాణ్ని కూడా క్రికెటర్‌ని చేద్దాం. కుడీ, ఎడమా లేకుండా బోల్డు సంపాదిస్తాడు."

"రన్స్ కొడితేనే డబ్బులొస్తాయి తెలుసా? వీడు కొట్టకపోతే?"

"దానికో ఉపాయం ఉంది లెండి. రెండు పక్షాల వాళ్లతోనూ ఒప్పందం కుదుర్చుకోవడమే! కొడితే వీళ్లిస్తారు, లేకపోతే వాళ్లిస్తారు. ఎలా అయినా నష్టం లేదు."

"అయితే వీడికి మాచ్ ఫిక్స్ చేసేవాళ్లు ఎవరైనా మంచివాళ్లు దొరకాలి."

"వేరే ఎవరో ఎందుకు? మీరే తయారవ్వచ్చు, ఇప్పటినుంచీ ప్రాక్టీసు చేస్తే..."

"నేనా? భలేదానివి"

"చూడండి. ఇన్నాళ్లూ మాచ్ ఫిక్సింగ్ అంటే పెళ్లిళ్లు కుదర్చడం అనుకొనేదాన్ని. పెళ్లిళ్ల పేరయ్య ఉద్యోగం ఏం బావుంటుంది అనుకునేదాన్ని. కానీ ఇప్పుడు తెలిసింది. మాచ్ ఫిక్సింగ్ అంటే? బోల్డు డబ్బు, ఇంటర్వ్యూలు, క్రికెటర్ల కంటే వీళ్లకే ఎక్కువ డిమాండ్."

"ఈ ఫిక్సింగ్ పని నాకు కొత్త కదా. ఇంతకీ నేను ఏం చెయ్యాలని నీ ఉద్దేశ్యం?"

"ఏమీ లేదు. పార్వతమ్మ గారి పనిమనిషి యాదమ్మ చక్కగా పనిచేస్తుంది. అది అక్కడ మానేసి మనింట్లో పని చేయాలని నా కోరిక. దానికి పార్వతమ్మ అడ్డుపడుతుంది. దానికేవేవో ఆశలు చూపించి..."

"ఈ పనిమనుషుల గొడవలో నా ప్రమేయం ఏమిటి?"

"అదే చెప్పవస్తున్నా, నేను యాదమ్మతో డైరెక్టుగా బేరమాడితే పార్వతమ్మ పసిగట్టేస్తుంది. మీరు యాదమ్మ గుడిసెకెళ్లి దాన్ని పార్వతమ్మ ఇంట్లో మానేసి, ఓ పదిహేను రోజులాగి మనింట్లో చేరమనండి."

"అంటే నేను పనిమనిషి ఫిక్సింగ్ చేయాలని నీ ఉద్ధేశ్యమా? దారుణం."

"పోనీ మీకా పేరు నచ్చకపోతే మాన్‌పవర్ ఫిక్సింగ్ అనండి... పనిమాత్రం చేసిపెట్టండి. మీకు గొప్ప ఫ్యూచరుంటుంది. కాలనీలో ఇల్లాళ్ల బేరాలన్నీ మీకే ఇప్పిస్తా!"